# కల

"ఇదుగో మిమ్మల్నే! ఆ పేపరలా పడేసి, ఇలా నా మాట వినండి. నిన్న రాత్రి నాకో పాడు కల వచ్చింది!" అంది శ్రీమతి.

"వస్తే నన్నేం చెయ్యమంటావ్? పేపరు చదవనియ్యకుండా నన్ను డిస్టర్బ్ చేస్తున్నావు!" అన్నాను విసుగ్గా.

"మీరు నాకు నచ్చిన కల విని తీరాల్సిందే - ఎందుకంటే అది మీకు సంబంధించినది కనుక!" అంటూ, నా చేతిలోని పేపరు లాగి బల్ల మీద పడేసింది.

'వినక తప్పదా?' అన్నట్లుగా శ్రీమతికేసి చూసేసరికి - విజయసూచకంగా నవ్వు నవ్వేసి, మొదలుపెట్టింది.

"నిన్న సాయంకాలం మనం పార్టీ కెళ్ళాం కదూ?- సరిగ్గా అదే దృశ్యం. మన తెలుగువాళ్ళం అందరం కలిసి, సరదాగా మాట్లాడుకొంటున్నాం. అంతలో, ఓ అందమైన

(ఆధునిక) యువతి మన మధ్యకి తిన్నగా వచ్చేసి, మిమ్మల్ని ముద్దు పెట్టుకొంది. మీ తలలో వేళ్ళు పెట్టి, "డియర్ రావ్! నీ కోసం నేనక్కడ వెయ్యి కళ్ళతో కాసుక్కూర్చుంటే నువ్విక్కడ మీ వాళ్ళతో మాటలెట్టుకొని కూర్చున్నావా? పద పోదాం." అంది గోముగా. అక్కడున్న మన వాళ్ళందరూ ఆశ్చర్యపడిపోయారు. నాకు నోట మాట రాక కొయ్యబారి పోయాను. అయితే నేను తేరుకొని మీ చెయ్యి పట్టుకొని, 'ఎన్నాళ్ళనుండీ ఈ భాగవతం?' అని కోపంగా అడిగాను. ఆ యువతి నన్నో తోపు తోసి, మిమ్మల్ని గట్టిగా పట్టుకొంది. అంతే మీరు.. మీరు..." శ్రీమతి ఆగింది.

"ఆ తర్వాత?..." అన్నాను కొంత ఉత్సాహంగా.

"....కుక్కగా మారి ఆమె వెనకగా వెళ్ళిపోయారు. నేను ఏడుస్తూ గోల పెడ్తూంటే, అందరూ నన్నోదారుస్తున్నారు. అంతలోనే మీరు సన్నగా బక్కచిక్కిపోయి నీరసంగా లోపలికి వస్తున్నారు. మిమ్మల్ని చూసి ఏదో అనబోయేలోగానే మెలకువ వచ్చింది"

"ఈ వెధవ కల చెప్పడానికేనా, ఇంత హంగామా చేసింది!"

"కాదు. కాని మీ మీద నాకు నిజంగానే అనుమానమేస్తోంది. కొన్ని రోజులుగా, మీ వాలకాన్ని బట్టి చూస్తే మీరు నిజంగా ఏ టక్కులాడి వలలోనో చిక్కుకున్నట్లుగా ఉంది! ఏమండీ, నిజం చెప్పండి! లేకపోతే అటువంటి కల నాకెందుకు రావాలి?"

"ఎందుకు వచ్చిందో, చెప్పనా?" అన్నాను. 'సరే' అన్నట్లుగా తల ఊపింది.

"నేనెవరికో దాసుణ్ణి కావడం లేదు. నీలోని మూర్ఖత్వానికీ, స్వార్థానికీ లొంగి పోతున్నాను. అదుగో.... మూతి అలా పెట్టక, నే చెప్పేది విను. ఏదో మొగవాణ్ణి కనుక నాకు కొంత స్వేచ్ఛ ఉండాలి. ఏదో ఆఫీసు స్నేహితులతో ఓ ఆదివారం ఇంగ్లీషు సినిమా చూస్తే, యింట్లో ఎవరో కాలం చేసినంతగా ఏడుస్తావ్! ఆ ఏడుపు భరించలేక ఇంగ్లీష్ సినిమాలు చూడడం మానుకొన్నాను. హిందీ సినిమాలకెడ్తే, చంటివెధవ అవసరాలకి ఛస్తే నువ్వు కుర్చీలోంచి కదలవు! ఆ పాట్లన్నీ నేనే పడ్తున్నాను. పులిని చూసి నక్క వాత పెట్టుకొన్నట్లుగా... పక్కింటి మిసెస్ గుప్తా సిల్కుచీర కొనుక్కొంటే, దానికి రెట్టింపు ధర చీర తెచ్చేవరకూ ప్రాణం తోడేశావ్! ఇలా చెప్పుకొంటూ పోతే లక్షలు! నువ్వు నిద్రపోయినప్పుడు- నీలో, నిద్రాణితమైన మంచి మేల్కొంది. అదే కలలోని నువ్వు. నేను పైన చెప్పిన దుర్గుణాలన్నీ మూర్తీభవించి ఆ (ఆధునిక) యువతిగా మారాయి. అంటే నువ్వు కలగన్నది - నీ దుర్గుణాలనీ, వాటికి దాసోహం అన్న నన్నూ! ఇంకా....."

"ఇంకేమీ చెప్పఖ్ఖర్లేదు..." అంటూ శ్రీమతి అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయింది.

నేను చెప్పిన వివరణ వింటే, ఫ్రాయిడ్ ఏమనుకొనే వాడో నాకు తెలియదు కాని -రెండు రూపాయలు పెట్టి కొబ్బరికాయ కొన్నప్పుడల్లా (మేం ఉండేది కోనసీమ కాదు, కాశ్మీరు) తన కిష్టమయిన కొబ్బరి పచ్చడి చేసే శ్రీమతి, ఆ రోజు నాకిష్టమయిన "కొబ్బరికోరూ - శనగపప్పు" కూర వండింది.

(ఇప్పుడు కోనసీమలోనే ఏడు రూపాయలలకు తక్కువ లేదు).

*(యువ మాస పత్రిక : ఫిబ్రవరి 1972))*